E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 19-05-2025 (వారం) సోమవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



నిధుల మంజూరు..పాక్‌కు ఐఎంఎఫ్ నిబంధనలు

» 2లో

## దిల్లీపై గుజరాత్ సూపర్ విక్టరీ.. ప్లే ఆఫ్స్‌కు మూడు జట్లు

» 6లో



## తైవాన్ కంపెనీతో ప్రీమియర్ ఎనర్జీస్ జేవీ ఏర్పాటు

» 4లో



## సంయుక్త ఆశలన్నీ ఆ సినిమా మీదే..

» 5లో



# గుల్జార్‌హౌస్ సమీప భవనంలో

## భారీ అగ్నిప్రమాదం.. 17 మంది మృతి



**నగరంలోని చార్మినార్‌కు అతి సమీపంలో ఉన్న గుల్జార్ హౌస్ వద్ద జీ+2 భవనంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది.**

**ఈ కబురు,హైదరాబాద్:** నగరంలోని చార్మినార్ పరిధిలో ఘోర విషాదం చోటుచేసుకుంది. చార్మినార్‌కు అత్యంత సమీపంలోని గుల్జార్ హౌస్ వద్ద ఉన్న ఓ జీ+2 భవనంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి.



ఈ ఘటనలో 17 మంది మృతిచెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, నలుగురు మహిళలు ఉన్నారు. ప్రమాదంతో భవనంలో ఉన్న పలువురు ఊపిరి ఆడక స్పృహ కోల్పోయారు. దీంతో వారిని ఉస్మానియా, యశోద (మలక్‌పేట), డీఆర్డీవో అపోలో ఆస్పత్రులకు తరలించారు. కొందరు ఘటనాస్థలంలో.. మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతిచెందారు.

షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలానికి అగ్నిమాపక, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ, పోలీసు సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఉన్న మరికొందరిని బయటకు తీసుకొచ్చారు. 10 అగ్నిమాపక యంత్రాలతో సహాయక చర్యలు చేపట్టారు. గుల్జార్ హౌస్ పరిసరాల్లో దట్టంగా పొగ కమ్ముకోవడంతో శ్వాస తీసుకునేందుకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

తరువాయి 2లో

## 33.83 కోట్లతో బెట్టేతండా లిఫ్ట్..

### 2140 ఎకరాల భూమికి సాగు నీరు : మంత్రి ఉత్తమ్



ఈ కబురు: పాలకవీడు మండలంలోని బెట్టేతండా గ్రామ శివారులోని మూసీ నదిపై 33.83 కోట్లతో నిర్మాణ పనులను రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఆదివారం పాలకవీడు మండలంలోని బెట్టేతండా లిఫ్ట్ అలాగే కృష్ణా నదిపై జాన్ పహాడ్ శివారులో జాన్ పహాడ్ జవహర్ లిఫ్టు జరుగుతున్న లిఫ్ట్ పనులను ఆయన ఎమ్మెల్సీ రమావత్ శంకర్ నాయక్ తో కలిసి పరిశీలించారు.పాలకవీడు మండలంలోని మునినదిపై బెట్టేతండా గ్రామ శివారులో 33.83 కోట్లతో ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ వలన బెట్టేతండా పాడ్య తండా సజ్జపురం గ్రామాల్లోని 2041 ఎకరాల భూమికి సాగునీరు అందుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. దీనివలన 2176 రైతులకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఒక్కొక్క ఎకరానికి లక్ష 66వెయిల రూపాయలను ఖర్చు చేస్తుందన్నారు. ఈ లిఫ్టు పనులు పూర్తి అయితే 1877 గిరిజన రైతులకు 34 మంది ఎస్సీ, 168 మంది బీసీ , 97 మంది ఓసి రైతుల భూములకు సాగునీరు చేరుతుందన్నారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి అయిందని భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం కూడా అందించడం జరిగిందని తెలిపారు. ఈ లిఫ్టు పనులను ఆగస్టు వరకు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ హనుమంత రావుకు ఆదేశించారు. పనులలో జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. బెట్టేతండా చెక్ డాం కూడా అవసరం ఉందని గుర్తించామని వాటికి సంబంధించిన పనులకు ప్రతిపాదనలు తయారుచేసి త్వరగా పంపించాలని ఇరిగేషన్ సిఈ రమేష్ బాబుకు ఆదేశించారు.

తరువాయి 2లో

## పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో అందాల భామల సందడి: తుపాకులు పట్టుకుని ఫోజులు

*ఈ కబురు,హైదరాబాద్: మిస్ వరల్డ్ 2025 పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన సుందరీమణులు తెలంగాణను చుట్టేస్తున్నారు. ఇప్పటికే తెలంగాణలోని ప్రముఖ పర్యాటక స్థలాలు చార్మినార్, చౌహమహల్లా ప్యాలెస్, రామప్ప, వేయిస్థంభాల గుడి, యాదగిరి గుట్ట, పిల్లలమర్రి, ఎక్స్ పీరియం ఎకో పార్క్ వంటి స్థలాలను సందర్శించిన అందాల భామలు ఆదివారం (మే 18) హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు.*

» 2లో



## సెక్రటేరియట్ లో అందగత్తెలు

*ఈ కబురు: సెక్రటేరియట్ లో అందగత్తెలు మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ సెక్రటేరియట్ ను సందర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి సమర్పించారు. అనంతరం సచివాలయం ముందు ఫోటోలు దిగారు. అంతకుముందు బంజారాహిల్స్ లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ ను సందర్శించారు మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్.*

» 2లో



## గుల్జార్‌హౌస్ ఘటన.. పరిహారం

### ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం



చార్మినార్ గుల్జార్‌హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి 17 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహతో కలిసి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఘటనాస్థలిని పరిశీలించారు.

తరువాయి 3లో

## మరోసారి గాజాపై విరుచుకుపడ్డ

### ఇజ్రాయెల్..103 మంది మృతి



ఈ కబురు: ఇజ్రాయెల్- హమాస్ ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో టెల్ అవీవ్ గాజాపై భీకర దాడులను కొనసాగిస్తోంది. శనివారం అర్ధరాత్రి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న పలు నివాసాలు, శిబిరాలపై వైమానిక దాడులు జరపడంతో ఖాన్‌యూనిస్‌లో 29 మంది, ఉత్తర గాజాలో 48 మంది, జబాలియాలోని శరణార్థి శిబిరంలో 26మంది మరణించారని రోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

తరువాయి 3లో

## ఉక్రెయిన్‌పైకి వందలాది డ్రోన్లు..

### రష్యా అతిపెద్ద దాడులు!



ఈ కబురు: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి విరుచుకుపడింది. రాత్రికి రాత్రే ఏకంగా వందలాది డ్రోన్లను ప్రయోగించింది. 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలు మాస్కో జరిపిన అతిపెద్ద డ్రోన్ దాడుల్లో ఇది ఒకటని ఉక్రెయిన్ వర్గాల సమాచారం. యుద్ధం ముగింపు విషయంలో ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల ప్రతినిధుల మధ్య ముఖాముఖి శాంతి చర్చలు జరిగిన రోజుల వ్యవధిలోనే ఈ భారీ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం.

తరువాయి 3లో



## గుల్జార్‌హౌస్ అగ్ని ప్రమాదంపై విచారణకు సీఎం ఆదేశం

ఈ కబురు, హైదరాబాద్: గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంపై విచారణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రమాద కారణాలపై లోతుగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందడం బాధాకరమని రేవంత్ అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియాను సీఎం ప్రకటించారు.

ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించటంతో భారీ ప్రాణనష్టం తప్పిందని.. అగ్నిమాపక సిబ్బంది దాదాపు 40 మందిని ప్రాణాపాయ స్థితి నుండి సురక్షితంగా బయటకు తీసుకురాగలిగారని సీఎం రేవంత్ అన్నారు. మంటల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు అగ్నిమాపక బృందం తమ శక్తియుక్తులు ప్రయత్నించిందన్నారు. కాగా, చార్మినార్ గుల్జార్‌హౌస్‌లో ఇవాళ ఉదయం ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా 17మంది మృతి చెందారు. మృతుల్లో ఏడుగురు చిన్నారులు, నలుగురు మహిళలు సహా మొత్తం 17 మంది ప్రాణాలు కోల్పోయారు.

మృతి చెందిన వారిలో రాజేంద్రకుమార్ (67),అభిషేక్ మోదీ (30), సుమిత్ర (65), మున్నీబాయి (72), ఆరుషి జైన్ (17), శీతల్ జైన్ (37), ఇరాజ్ (2), హర్షాలీ గుప్తా (7), రజని అగర్వాల్, అన్య మోదీ, పంకజ్ మోదీ, వర్ష మోదీ, ఇద్దిక్కి మోదీ, రిషభ్, ప్రథమ్ అగర్వాల్, ప్రాంశు అగర్వాల్ ఉన్నారు. ఫైర్ యాక్సిడెంట్ చిన్నదే అయినా భవనంలో 30 మంది ఉండటంలో భారీ ప్రాణనష్టం జరిగింది.

## “గుల్జార్ హౌస్ ప్రమాద ఘటన కలచివేసింది: మోదీ



చార్మినార్ పరిధి గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ కబురు,హైదరాబాద్: చార్మినార్ పరిధి గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

తరువాయి 2లో

ఈ-కబురు

19- 05 -2025
సోమవారం
e-kaburu.com

మొదటి పేజీ తరువాయి

# గుల్జార్‌హౌస్ సమీప భవనంలో భారీ అగ్నిప్రమాదం.. 17 మంది మృతి








షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనా స్థలానికి అగ్నిమాపక, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ, పోలీసు సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఉన్న మరికొందరిని బయటకు తీసుకొచ్చారు. 10 అగ్నిమాపక యంత్రాలతో సహాయక చర్యలు చేపట్టారు. గుల్జార్ హౌస్ పరిసరాల్లో దట్టంగా పొగ కమ్ముకోవడంతో శ్వాస తీసుకునేందుకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు. అగ్నిప్రమాద ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో 17 మంది మృతి చెందడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. బాధిత కుటుంబసభ్యులతో రేవంత్ ఫోన్‌లో మాట్లాడి ఓదార్చారు. మరోవైపు ఘటనా స్థలాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి తదితరులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అగ్నిమాపక సిబ్బందికి సరైన శిక్షణ అందించాలి: కిషన్‌రెడ్డి

అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు ప్రమాదం జరిగిందని చెప్పారు. సహాయక చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది ఆలస్యం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారని తెలిపారు. చిన్న ప్రమాదమే అయినా.. ప్రాణ నష్టం ఎక్కువగా ఉందన్నారు. అగ్నిమాపక సిబ్బందికి ప్రభుత్వం సరైన పరికరాలు, శిక్షణ అందించాల్సి ఉందని చెప్పారు. అగ్నిమాపక శాఖ సాంకేతికతను మెరుగుపరుచుకోవాలని అభిప్రాయపడ్డారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు కేంద్రం తరపున సాయం అందిస్తామని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాలి లేదు. వెలుతురు రాదు. పొగ కూడా బయటకు వెళ్లడానికి వీలులేకుండా ఉన్న ఇంటి నిర్మాణ లోపాలే ప్రహ్లాద్‌మోదీ ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17 ప్రాణాలు పోవడానికి కారణమయ్యాయి. నిజాం కాలంలో నిర్మించిన పాతకాలం భవనానికి సెట్‌బ్యాక్‌లు లేవు. అక్కడున్న అన్ని భవనాలదీ ఇదే దుస్థితి. రెండు పక్కపక్క భవనాలకు ఒకటే గోడ ఉంటుంది. అందువల్ల అక్కడ దాదాపు ఏ భవనానికీ రెండు వైపులా కిటికీలుండవు. ప్రమాదానికి కారణమైన ప్రహ్లాద్ ఇంటిదీ ఇదే పరిస్థితి. ఈ జీ+2 భవనంలో కింద మూడు పోర్షన్లలో ముత్యాల దుకాణాలు ఉన్నాయి. ఈ భవనానికి ఒకవైపు నాలుగైదు అడుగుల వెడల్పులో పైపోర్షన్లోకి రాకపోకలు సాగించడానికి మెట్లు నిర్మించారు. ఇక్కడే విద్యుత్తు మెయిన్, మీటర్లను అమర్చారు. పైరెండు పోర్షన్లలో ఉంటున్న వారు రాకపోకలు సాగించడానికి ఇదే మార్గం. అయితే దుకాణాలు మూసేసిన తర్వాత దీనికి ముందువైపు షట్టర్ వేస్తారు. లోపల నుంచి తాళం వేసుకుంటే ఇక చీమ కూడా చొరబడలేదు. దీనికి రెండోవైపు సొరంగం లాంటి మెట్ల దారి ఉంది. ఇక్కడ ఒక మనిషి ఎదురైతే రెండో మనిషి ఆగిపోవాల్సిందే. దీనికి కూడా ముందువైపు షట్టర్ వేసేస్తే గాలి కూడా ఆడదు. దుకాణాలు మూసివేసిన తర్వాత మెట్ల మార్గంలో లోనికి వెళ్లిన వారు మొదటి అంతస్తులో ఉన్న వరండాలోకి ప్రవేశిస్తారు. అక్కడి నుంచి ఒక్కో పోర్షన్‌లో రెండు గదుల చొప్పున మొత్తం రెండు పోర్షన్లు ఉన్నాయి. వీటికి ముందూ, వెనకా తలుపులు మాత్రమే ఉంటాయి. ఇక వరండా నుంచి మెట్ల మీదుగా పైకి వెళితే రెండో అంతస్తులో కూడా ఇలానే రెండు పోర్షన్లు ఉంటాయి. వీటికీ ముందూ, వెనుకా తలుపులు మాత్రమే ఉన్నాయి. గాలి కూడా చొరబడని ఈ ఇంట్లో సహజంగానే వేడిగా ఉంటుంది. అందుకే ఎనిమిది గదులుంటే వాటిలో ఆరు ఏసీలు పెట్టినట్లు తెలుస్తోంది. ఇంటి యజమాని ఆహ్వానం మేరకు ఇతర కుటుంబాల సభ్యులు రావడంతో మొత్తం 21 మంది అయ్యారు. అంతా మొదటి, రెండు అంతస్తుల్లో నిద్రించారు. ఏసీలన్నీ వేయడంతో లోడు పెరిగి... షార్ట్ సర్క్యూట్ అయినట్లు అధికారులు భావిస్తున్నారు. కింది అంతస్తు మెట్ల వద్ద అమర్చిన మెయిన్, మీటర్ల దగ్గర మంటలు మొదలయ్యాక... మొదటి, రెండు అంతస్తుల్లో వెనకవైపున్న నాలుగు ఏసీ కంప్రెషర్లు పేలిపోయాయి. చెక్క నిర్మాణాలతోపాటు మెట్ల వద్ద పార్క్ చేసిన బైక్‌లకు మంటలు అంటుకున్నాయి. వీటిల్లోని పెట్రోల్ కారణంగా మంటల తీవ్రత పెరిగింది. వాహనాల సీట్ల కవర్లు కాలిపోయి దట్టమైన పొగలు వ్యాపించాయి. అక్కడున్న షట్టర్ మూసేసి ఉండటంతో పొగ పైకి వ్యాపించి రెండు అంతస్తులను కమ్మేసింది. గాఢనిద్రలో ఉన్న వారు ఈ పొగను పీల్చి మెలకువ వచ్చేలోపే అపస్మారక స్థితి వెళ్లి ఉంటారని అంచనా వేస్తున్నారు. స్పృహలోకి వచ్చినా ఏం జరిగిందో గ్రహించేలోపే మరింత పొగ పీల్చి పడిపోయి ఉంటారని, మృతదేహాలను చూస్తే అదే జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సహాయ చర్యల కోసం తాము లోనికి వెళ్లేసరికే అంతా అపస్మారక స్థితిలోనే ఉన్నారని అగ్నిమాపక సిబ్బంది వెల్లడించారు.కింద అంతస్తులో మొదలైన పొగ రెండో అంతస్తుకి వ్యాపించేలోపు అక్కడ నిద్రిస్తున్న మహిళల్లో ఇద్దరికి మెలకువ రావడంతో... మెట్ల మీదుగా కిందికి దిగి షట్టర్ తెరిచారు. అగ్ని ప్రమాదం జరిగిందని పెద్దగా కేకలు వేయడంతో ఎదురుగా ఉండే దుకాణాల వారు వచ్చి మరో ఇద్దర్ని రక్షించారు. అప్పటికే ఇల్లంతా పొగ కమ్ముకోవడంతో అంతా చీకటిగా మారింది. సహాయం చేసేందుకు వచ్చిన అగ్నిమాపక సిబ్బంది కూడా ఆక్సిజన్ మాస్కులు పెట్టుకొని, టార్చిలైట్లు వాడుతూ... పొగను తొలగించడానికి యంత్రాలు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. అప్పటికే కొందరు క్షతగాత్రులను స్థానికులు కిందికి తీసుకొచ్చారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది మరికొందర్ని కిందికి దించారు.

## మృతుల్లో 8 మంది

| | |
|---|---|
| చిన్నారులే.. | ఇరాజ్ (2) |
| ప్రహ్లాద్ (70) | ఆరుషి (3) |
| మున్నీ (70) | రిషభ్ (4) |
| రాజేందర్ మోదీ (65) | ప్రథమ్ (ఏడాదిన్నర) |
| సుమిత్ర (60) | అనుయాన్ (3) |
| హమేయ్(7) | వర్ష (35) |
| అభిషేక్ (31) | పంకజ్ (36) |
| శీతల్ (35) | రజినీ (32) |
| ప్రియాంశ్ (4) | ఇద్దు (4) |

మొదటి పేజీ తరువాయి

## గుల్జార్ హౌస్ ప్రమాద ఘటన కలచివేసింది: మోదీ



ఈ కబురు,హైదరాబాద్: చార్మినార్ పరిధి గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదంలో పలువురి మృతి కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల పరిహారం అందిస్తామన్నారు. గుల్జార్‌హౌస్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 17 మంది మృతి చెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులున్నారు. ఆదివారం ఉదయం భవనం మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న కొందరిని అగ్నిమాపక సిబ్బంది రక్షించి ఉస్మానియా, యశోద (మలక్‌పేట), డీఆర్డీవో అపోలో ఆసుపత్రులకు తరలించారు. విద్యుదాఘాతం వల్లే భవనంలో మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మొదటి పేజీ తరువాయి

## నిధుల మంజూరు..పాక్‌కు ఐఎంఎఫ్ నిబంధనలు

పాకిస్థాన్‌కు నిధులు మంజూరు చేయడానికి ఐఎంఎఫ్ ఆ దేశానికి పలు ఆంక్షలు పెట్టింది.

ఈ కబురు: పాకిస్థాన్‌కు 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8,540 కోట్లు) మంజూరుకు అంతర్జాతీయ ద్రవ్య నిధి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ నిధులను మంజూరు చేయడానికి ఐఎంఎఫ్ పలు షరతులు విధించింది. అంతే కాకుండా భారత్‌తో ఉద్రిక్తతలు ఇంకా పెంచుకోవడం వల్ల పాక్‌కే ఎక్కువ సమస్యలు వస్తాయని చురకలు అంటించింది. ఈ ఘర్షణలు దేశంలో ఆర్థిక, బాహ్య సంస్కరణల లక్ష్యాలకు ముప్పు కలిగిస్తాయని హెచ్చరించింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల వల్ల స్టాక్ మార్కెట్ మొదట నష్టాల్లోకి వెళ్లినప్పటికీ..ప్రస్తుతం స్థిరంగా ఉన్నాయని ఐఎంఎఫ్ నివేదికలు పేర్కొన్నాయి.ఐఎంఎఫ్ ఇస్తున్న నిధులను పాక్ అభివృద్ధికి కాకుండా ఉగ్రవాదులను పోషించడానికి వినియోగిస్తోందని భారత్ ఇటీవల ఆరోపించింది. ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన ఉగ్రవాద స్థావరాలను పునర్నిర్మించడానికి జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు రూ.14 కోట్లు ఇస్తున్నట్లు పాక్ ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొంది. పాక్‌కు నిధులు మంజూరు చేస్తే పరోక్షంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్లే అవుతుందని.. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఐఎంఎఫ్ పాక్‌కు నిధులు సమకూర్చడంపై పునరాలోచించాలని మోదీ ప్రభుత్వం కోరినప్పటికీ.. అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి పాక్‌కు 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8,540 కోట్లు) మంజూరయ్యాయి. ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కింద ఈ మొత్తాన్ని ఇవ్వడానికి ఐఎంఎఫ్ ఆమోదం తెలిపింది.

మొదటి పేజీ తరువాయి

# 33.83 కోట్లతో బెట్టేతండా లిఫ్ట్.. 2140 ఎకరాల భూమికి సాగు నీరు : మంత్రి ఉత్తమ్



దీనివలన 2176 రైతులకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఒక్కొక్క ఎకరానికి లక్ష 66వెయిల రూపాయలను ఖర్చు చేస్తుందన్నారు. ఈ లిఫ్టు పనులు పూర్తి అయితే 1877 గిరిజన రైతులకు 34 మంది ఎస్సీ, 168 మంది బీసీ , 97 మంది ఓసి రైతుల భూములకు సాగునీరు చేరుతుందన్నారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి అయిందని భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం కూడా అందించడం జరిగిందని తెలిపారు. ఈ లిఫ్టు పనులను ఆగస్టు వరకు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ హనుమంత రావుకు ఆదేశించారు. పనులలో జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. బెట్టేతండా చెక్ డాం కూడా అవసరం ఉందని గుర్తించామని వాటికి సంబంధించిన పనులకు ప్రతిపాదనలు తయారుచేసి త్వరగా పంపించాలని ఇరిగేషన్ సిఈ రమేష్ బాబుకు ఆదేశించారు.


**జాన్ పహాడ్ జవహర్ లిఫ్టు పనులపై మంత్రి అసంతృప్తి..**

కృష్ణా నదిపై జాన్ పహాడ్ శివారులో 273 కోట్లతో జాన్ పహాడ్ జవహర్ లిఫ్టు జరుగుతున్న లిఫ్ట్ పనులను పరిశీలించిన ఆయన అసంతృప్తి వ్యక్తం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత జనవరి నెలలో ఇక్కడికి వచ్చి పనులు పరిశీలించినప్పుడు ఆగస్టు వరకు పూర్తి చేస్తామని చెప్పినా మెగా కంపెనీకి చెందిన కాంట్రాక్టర్ ఆ పనులలో పురోగతి చూపించకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. నేను ఇలా రావడం ఇది మూడోసారి వస్తున్న పెద్దగా ప్రోగ్రెస్ కనిపించడం లేదని .. ఇక్కడ మిషన్ కూడా లేవు పని ఎక్కడా జరిగినట్టు కనిపించడం లేదన్నారు.ఈరోజు నేను ఇక్కడికి వస్తూ ఉన్నానని తెలిసి కూడా కాంట్రాక్టర్ శ్రీనివాస్ రాకపోవడం ఏంటి అంటూ ప్రశ్నిస్తూనే కాంట్రాక్టర్ శ్రీనివాస్ కు నీటిపారుదల సిఈ రమేష్‌బాబుకు పనులు ఇలా జరిగితే కుదరదు అంటూ వార్నింగ్ ఇచ్చారు. ఈ లిఫ్టు పూర్తయితే 13 గ్రామాలకు చెందిన రైతుల భూములకు 5600 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. అలాగే పైప్ లైన్ కోసం 12 ఎకరాల భూమి అదనంగా భూ సేకరణ చేయబడిందని వాటికి సంబంధించి రైతులకు డబ్బులు కూడా ప్రభుత్వం అందించిందని తెలిపారు. నవంబర్ నాటికి పూర్తి చేసి అందించాలని కాంట్రాక్టర్ తో పాటు ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. అలాగే ఇక్కడ జరుగుతున్న పనులపై మంత్రి ఉత్తమ్ కాంట్రాక్టర్ శ్రీనివాస్ కు ఫోన్లో మెసేజ్ ద్వారా గా సమాచారం అందించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమావత్ శంకర్ నాయక్ ఆర్డీఓ శ్రీనివాసులు ఇరిగేషన్ సీఈ రమేష్‌బాబు డి.ఎస్.పి శ్రీధర్ రెడ్డి ఇరిగేషన్ ఎస్ ఈ శివధర్మ తేజ ఈఈ లు రామకృష్ణ సత్యనారాయణ సీఐ చరమండరాజు తాసిల్దార్ కమలాకర్ మాజీ ఎంపీపీ భూక్య గోపాల్ ,మాజీ జెడ్పిటిసి మాలోత్ బుజ్జి మోతిలాల్ మండల పార్టీ అధ్యక్షులు సుబ్బారావు బెల్లంకొండ నరసింహారావు చక్రధరరావు శివరాం పాల్గొన్నారు.

## పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో అందాల భామల సందడి: తుపాకులు పట్టుకుని ఫోజులు











రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, మహిళలు పిల్లలపై వేధింపుల నివారణ, డ్రగ్స్ కట్టడికి చేపట్టిన చర్యలు, నేరాల నియంత్రణ, నేర నివారణలో ఉపయోగిస్తున్న ఆధునిక శాస్త్ర సాంకేతిక పద్ధతులు తదితర అంశాలపై తెలంగాణా పోలీస్ శాఖ చేపట్టిన పటిష్టమైన చర్యలపట్ల మిస్ వరల్డ్ కాంటెస్టర్లు సంతృప్తిని వ్యక్తం చేశారు డ్రగ్స్ నివారణకై తెలంగాణా పోలీస్ చేపట్టిన చర్యలకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ పోస్టర్లపై సంతకాలు చేసి పలు మెసేజ్‌లను కూడా రాశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల రక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న పలు విధానాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ముందుగా బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకున్న మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్‌లకు పోలీస్ అశ్విక దళం, పైపు బ్యాండ్, మోటర్ సైకిల్ రైడర్స్, స్నిప్పర్ డాగ్ స్క్వాడ్‌లతో పోలీస్ శాఖ ఘన స్వాగతం పలికింది. అనంతరం పోలీస్ కమాండ్ కంట్రోల్ ఆడిటోరియంలో పోలీస్ శాఖ అమలు చేస్తోన్న పలు విధానాలు, అవి పనిచేసే విధానంపై అందాల భామలకు ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పటిష్టమైన విధానాలవల్ల రాష్ట్రంలో 17 శాతం నేరాలు తగ్గాయని, వివిధ అంశాలలో తెలంగాణా పోలీస్ కు అంతర్జాతీయ అవార్డులు కూడా లభించాయని వారికి చెప్పారు.

దేశంలో మరెక్కడా లేని విధంగా ట్రాన్స్ జెండర్ల సేవలను ట్రాఫిక్ విభాగంలో ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. మొత్తం ప్రపంచానికే సవాలుగా మారిన సైబర్ నేరాల నియంత్రణలో అత్యంత ఆధునిక టెక్నాలజీని వాడుతున్నామని, లక్షల సంఖ్యలో ఏర్పాటు చేసిన సీసీ టీవీల వల్ల, రాష్ట్రంలో ఎక్కడ నేరం జరిగినా వెంటనే తగు చర్యలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా సేఫ్టీ టూరిజంలో తెలంగాణా అత్యంత సురక్షితమైనది, ఇందుకు తెలంగాణా పోలీస్ చేపట్టిన పటిష్టమైన చర్యలే కారణమని వివరించారు. ఈ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన పోలీసు ఆయుధాల ప్రదర్శన, అక్టోపస్, గ్రే హౌండ్స్, పోలీస్ జాగిలాల ప్రదర్శనలు, పైప్ బ్యాండ్, అశ్విక దళంలను కాంటెస్టర్లు ఆసక్తిగా పరిశీలించారు. సెల్ఫీలను దిగారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను నిరంతరం పరిశీలించే అత్యాధునిక కమాండ్ కంట్రోల్ గదిలో ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సర్వేలెన్స్ ఫీడ్‌లు, తక్షణమే స్పందించే వ్యవస్థను మిస్ వరల్డ్ కాంటెస్టర్లు స్వయంగా పరిశీలించారు. జీవ ప్రమాణాలు పెంపొందించడం, సురక్షిత టూరిజంకు, రాష్ట్ర అభివృద్ధికి భద్రతా చర్యలు ఎంతటి కీలక పాత్ర వహిస్తాయో తెలంగాణా పోలీస్‌ను ఉదాహరణ చెప్పవచ్చని మిస్ వరల్డ్ కాంటెస్టర్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం, మరే రాష్ట్రంలో లేని విధంగా, ట్రాఫిక్ నియంత్రణా చర్యలకు సేవలందిస్తున్న ట్రాన్స్ జెండర్లతో కలసి మిస్ వరల్డ్ కాంటెస్టర్లు ఫోటో దిగారు.

మొదటి పేజీ తరువాయి


## సెక్రటేరియట్ లో అందగత్తెలు

అందాల భామలకు పోలీస్ అశ్విక దళం, పైపు బ్యాండ్, మోటర్ సైకిల్ రైడర్స్ తో స్వాగతం పలికారు. మిస్ వరల్డ్ పోటీదారులకు కమాండ్ కంట్రోల్ రూమ్ లోని మల్టీ ఏజెన్సీ ఆపరేషన్ సెంటర్లో.. రాష్ట్రంలో శాంతిభద్రతలపై పోలీసు శాఖ చేపట్టిన ఇనిషియేటివ్ లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివీ ఆనంద్, కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి.

దేశంలోనే తెలంగాణ పోలీసు కు చెందిన 80 వేల మంది నిరంతరం శాంతి, భద్రతలో నిమగ్నమై అత్యున్నత పోలీస్ గా నిలిచింది. షీ టీమ్స్, భరోసా, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, గ్రేహౌండ్స్, ఆక్టోపస్, టీ సేఫ్, టీ.ఎస్ కాప్స్ , టెక్నాలజీస్, స్మార్ట్ పోలీస్, తదితర ఇనిషియేటివ్ లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు అధికారులు. రాష్ట్రంలో 16 శాతం నేరాలు తగ్గాయి. సేఫ్ టూరిజం కేంద్రంగా తెలంగాణ ఉందని వివరించారు అధికారులు.







# మరోసారి గాజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్..103 మంది మృతి



ఈ కబురు: ఇజ్రాయెల్ హమాస్ ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో టెల్ అవీవ్ గాజాపై భీకర దాడులను కొనసాగిస్తోంది. శనివారం అర్ధరాత్రి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న పలు నివాసాలు, శిబిరాలపై వైమానిక దాడులు జరపడంతో ఖాన్‌యూనిస్‌లో 29 మంది, ఉత్తర గాజాలో 48 మంది, జబాలియాలోని శరణార్థి శిబిరంలో 26మంది మరణించారని రోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

మొత్తం 103 మంది మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 9మంది ప్రాణాలు కోల్పోగా.. ఏడుగురు చిన్నారులు మృత్యువాత పడినట్లు అధికారులు పేర్కొన్నారు. పదుల సంఖ్యలో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. తాజా దాడులపై ఇజ్రాయెల్ సైన్యం ఎటువంటి ప్రకటనా చేయలేదు. కాగా శనివారం ఒక్కరోజే 150 మంది ప్రాణాలు కోల్పోయారని, 450 మందికి గాయాలయ్యాయని గాజా ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలిపింది. మార్చి 18న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు గురైనప్పటి నుంచి 3 వేల మందికిపైగా పాలస్తీనియన్లు మృత్యువాతకు గురయ్యారని వెల్లడించింది. దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవల కీలక ప్రకటన చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు హమాస్ అంగీకరించని కారణంగానే దాడులను తీవ్రం చేసినట్లు తెలిపారు. 'మా బందీలను విడుదల చేయడానికి హమాస్ పదేపదే నిరాకరిస్తోంది. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ ప్రతిపాదించిన కాల్పుల ఒప్పందం కొనసాగింపును తిరస్కరించింది. ఈనేపథ్యంలోనే దాడులకు ఆదేశించాం. యుద్ధం లక్ష్యాలను సాధించడానికి గాజాలోని హమాస్ స్థావరాలే లక్ష్యంగా ఐడీఎఫ్ దాడులు చేస్తోంది' అని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

# గుల్జార్‌హౌస్ ఘటన.. పరిహారం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం



ఈ కబురు,హైదరాబాద్: చార్మినార్ గుల్జార్‌హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి 17 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతులకు ఒక్కొక్కరికి రూ. 5లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహాతో కలిసి ఆయన ఘటనాస్థలిని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు.

"ఈ ఘటనపై అన్ని శాఖల అధికారులతో చర్చిస్తూ, ఎప్పటికప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ ద్వారా ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు చెబుతున్నారు. ఉదయం 6.16 గంటలకు అగ్నిమాపక సిబ్బందికి ప్రమాదం గురించి సమాచారం అందింది. వెంటనే 6.17కి మొగల్‌పుర ఫైర్ ఇంజిన్ సిబ్బంది బయలుదేరి 6.20గంటలకు ప్రమాదస్థలికి చేరుకొని సహాయకచర్యలు చేపట్టారు. ఈక్రమంలో మొత్తం 11 ఫైర్ ఇంజిన్లతో పాటు ఒక రోబోను ఉపయోగించారు. 70 మంది ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు. దీంతో ప్రమాద తీవ్రత మరింత పెరగకుండా నియంత్రించగలిగారు. ఈ ఘటన జరగడం అత్యంత దురదృష్టకరం. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది" అని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు.

# ఉక్రెయిన్‌పైకి వందలాది డ్రోన్లు.. రష్యా అతిపెద్ద దాడులు!

**ఉక్రెయిన్‌పై రష్యా ఏకంగా వందలాది డ్రోన్లను ప్రయోగించింది.**

ఈ కబురు: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి విరుచుకుపడింది. రాత్రికి రాత్రే ఏకంగా వందలాది డ్రోన్లను ప్రయోగించింది. 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలు మాస్కో జరిపిన అతిపెద్ద డ్రోన్ దాడుల్లో ఇది ఒకటని ఉక్రెయిన్ వర్గాల సమాచారం. యుద్ధం ముగింపు విషయంలో ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల ప్రతినిధుల మధ్య ముఖాముఖి శాంతి చర్చలు జరిగిన రోజుల వ్యవధిలోనే ఈ భారీ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. "కీవ్, నిప్రోపెట్రోవ్స్క్, దొనెట్స్క్ తదితర ప్రాంతాలే లక్ష్యంగా రష్యా దాడులకు తెగబడింది. 273 ఆత్మాహుతి డ్రోన్లను ప్రయోగించింది. వాటిలో 88 డ్రోన్లను కూల్చివేశాం" అని ఉక్రెయిన్ వైమానికదళం తెలిపింది. సంఖ్యాపరంగా ఇదే అతిపెద్ద డ్రోన్ దాడిగా తెలుస్తోంది. గతంలో మాస్కో ఓసారి 267 డ్రోన్లు ప్రయోగించింది. తాజా దాడుల్లో కీవ్ ప్రాంతంలో ఓ మహిళ మృతి చెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయని చెప్పారు. కీవ్ ప్రయోగించిన డ్రోన్లనూ కూల్చివేసినట్లు అటు రష్యా రక్షణశాఖ ప్రకటించింది. యుద్ధానికి కారణమైన అంశాలకు ముగింపు పలకడం, శాశ్వత శాంతి కోసం పరిస్థితులను సృష్టించడం, దేశ భద్రతకు హామీ వంటివి తమ లక్ష్యాలని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదివారం స్పష్టం చేశారు. కీవ్‌కు నాటో సభ్యత్వం ఇవ్వకపోవడం, క్రిమియా, మరో నాలుగు ప్రావిన్స్‌లు తమకు చెందుతాయని అంగీకరించడం వంటివి నెరవేర్చాలని మాస్కో మొదటినుంచి డిమాండ్ చేస్తోంది. మరోవైపు.. రక్తపాతం ఆపడమే తన ఎజెండా అని, ఈ విషయమై పుతిన్‌తో మాట్లాడతానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే.



# భారత్ చర్యల నేపథ్యంలో.. భుట్టో నేతృత్వంలో



**భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై ప్రపంచ దేశాలకు ఇస్లామాబాద్ వైఖరిని తెలియజేడానికి తమ నేతలనూ వివిధ దేశాలకు పంపించే యోచనలో ఆ ప్రభుత్వం ఉంది.**

ఉగ్రవాదంతో అంటకాగుతూ మన దేశంపై విషం చిమ్ముతున్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు ఏడు అఖిలపక్ష బృందాలను విదేశాలకు పంపనున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో పాక్ (Pakistan) సైతం ఇదే రకమైన చర్యలు తీసుకోనున్నట్లు అక్కడి ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. భారత్ తమపై చేసిన దాడుల గురించి విదేశాలకు వివరించడానికి మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో (Bhutto Zardari) నేతృత్వంలో ఓ బృందాన్ని పలు దేశాలకు పంపేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపాయి.

ఈ విషయంపై ఆ దేశ ఉప ప్రధాన మంత్రి ఇషాక్ దార్ మాట్లాడుతూ.. సరిహద్దుల్లో ఉద్రిక్తతలపై అమెరికా, యూకే, బెల్జియం, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలకు తమ వైఖరిని తెలియజేయడానికి సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు. ఈ ప్రతినిధి బృందంలో మాజీ డిప్యూటీ విదేశాంగ మంత్రి హీనా రబ్బానీ ఖర్, మాజీ రక్షణ మంత్రి ఖుర్రం దస్తగిర్ ఖాన్, మాజీ విదేశాంగ కార్యదర్శి జలీల్ అబ్బాస్ జిలానీ సభ్యులుగా ఉన్నట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ మేరకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. తమ బృందానికి నాయకత్వం వహించాలని తనను కోరినట్లు భుట్టో సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

**భారత క్షిపణులు మా స్థావరాలను తాకాయి**

కాగా సీమాంతర ఉగ్రవాదాన్ని పోషిస్తున్న పాక్ తీరును ప్రపంచ దేశాల ముందు ఎండగట్టడానికి ఏడు బృందాలను ప్రపంచ దేశాలకు పంపిస్తున్నట్లు భారత ప్రభుత్వం శనివారం ప్రకటించింది. ఎంపీలు శశిథరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్ (భాజపా), బైజయంత్ పాండా (భాజపా), సంజయ్‌కుమార్ ఝా (జేడీయూ), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలె (ఎన్సీపీఎస్పీ), శ్రీకాంత్ శిందే (శివసేన) ఈ బృందాలకు నేతృత్వం వహించనున్నట్లు తెలిపింది.

# ప్రపంచ తొలి 'ఏఐ డాక్టర్!'



కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రోగులను పరీక్షించే క్లినిక్.. ప్రపంచంలోనే తొలిసారిగా సౌదీ అరేబియాలో ప్రారంభమైంది. చైనాకు చెందిన వైద్య పరిజ్ఞాన సంస్థ సైన్యీ ఏఐతో భాగస్వామ్యం ద్వారా అల్‌మూసా హెల్త్ గ్రూప్ ప్రయోగాత్మకంగా దీన్ని అందుబాటులోకి తెచ్చింది. సౌదీలో ప్రయోగాత్మకంగా అందుబాటులోకి

ఈ కబురు: దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రోగులను పరీక్షించే క్లినిక్.. ప్రపంచంలోనే తొలిసారిగా సౌదీ అరేబియాలో ప్రారంభమైంది. చైనాకు చెందిన వైద్య పరిజ్ఞాన సంస్థ సైన్యీ ఏఐతో భాగస్వామ్యం ద్వారా అల్‌మూసా హెల్త్ గ్రూప్ ప్రయోగాత్మకంగా దీన్ని అందుబాటులోకి తెచ్చింది. సౌదీలోని అల్ అహ్సా ప్రావిన్స్‌లో ఇది ఏర్పాటైంది. రోగులతో తొలుత సంభాషించి, వ్యాధి నిర్ధారణ, చికిత్స చేసే బాధ్యత నుంచి వైద్యులను తప్పించడం దీని ఉద్దేశం. "ఈ ఏఐ క్లినిక్ వినూత్న వైద్య సేవా వ్యవస్థ. ఇందులో ఏఐ వ్యవస్థ స్వతంత్రంగా.. వివరాల సేకరణ నుంచి మందులు సూచించడం వరకూ పలు సేవలు అందిస్తుంది. అయితే ముందు జాగ్రత్త చర్యగా వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతుంది. వారు వ్యాధి నిర్ధారణ, చికిత్స ఫలితాలను సమీక్షిస్తారు" అని సైన్యీ సంస్థ పేర్కొంది.

**పనిచేసేదిలా!**

ఏఐ వైద్య వ్యవస్థకు 'డాక్టర్ హువా' అని పేరుపెట్టారు. క్లినిక్‌కు వచ్చాక.. ఒక ట్యాబ్ సాయంతో ఏఐకి తమ వ్యాధి లక్షణాలను రోగి వివరించాలి. వెంటనే అది మరిన్ని ప్రశ్నలు సంధిస్తుంది. మానవ సహాయకుల సాయంతో సేకరించిన డేటాను, చిత్రాలను విశ్లేషిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తికాగానే డాక్టర్ హువా ఒక చికిత్స ప్రణాళికను అందిస్తుంది. దీన్ని వైద్యుడు కూలంకషంగా సమీక్షించి, సంతకం చేస్తారు. అయితే ఏఐ పరిశీలించలేని అత్యవసర కేసుల కోసం వైద్యులు అందుబాటులో ఉంటారు. ప్రస్తుతం ఈ ఏఐ డాక్టర్ ద్వారా ఉబ్బసం సహా దాదాపు 30 రకాల శ్వాసకోశ రుగ్మతలకు సంబంధించిన కన్సల్టేషన్ సేవలను అందిస్తున్నారు. వైద్యుల డేటాబేస్‌ను విస్తరించి, 50 శ్వాస, జీర్ణకోశ, చర్మ సంబంధ వ్యాధులకు ఈ సేవలను అందించాలని భావిస్తున్నట్లు సైన్యీ ఏఐ తెలిపింది.

# రాజ్యాంగమే సర్వోన్నతం



సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్

**న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల కంటే భారత రాజ్యాంగమే సర్వోన్నతమైనదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ ఉద్ఘాటించారు. పార్లమెంటుకు రాజ్యాంగాన్ని సవరణ చేసే అధికారం ఉన్నా.. అది రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చకూడదని స్పష్టంచేశారు.**

ముంబయి: న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల కంటే భారత రాజ్యాంగమే సర్వోన్నతమైనదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఉద్ఘాటించారు. పార్లమెంటుకు రాజ్యాంగాన్ని సవరణ చేసే అధికారం ఉన్నా.. అది రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చకూడదని స్పష్టంచేశారు. సుప్రీంకోర్టు 52వ సీజేఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన మహారాష్ట్ర, గోవా బార్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన సత్కార కార్యక్రమంలో మాట్లాడారు. భారత్ పురోగతి సాధించడమే కాకుండా ఆర్థిక, సామాజిక రంగాల్లోనూ అభివృద్ధి చెందడం సంతోషంగా ఉందన్నారు. "న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థ, సుప్రీంకోర్టు, పార్లమెంటు కంటే భారత రాజ్యాంగమే సర్వోన్నతమైనది. మూలస్తంభాలుగా ఉన్న ఈ విభాగాలు రాజ్యాంగం ప్రకారం కలిసి పని చేయాలి. ఇందులోని అన్ని వ్యవస్థలు సహకారం అందించుకుంటూ పరస్పరం గౌరవించుకోవాలి" అని సీజేఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను గతంలో ఇచ్చిన 50 కీలక తీర్పులతో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రొటోకాల్ పాటించకపోవడంపై ఆగ్రహం మహారాష్ట్ర అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడంపై సీజేఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. తనకు స్వాగతం చెప్పడానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డీజీపీ లేదా ముంబయి పోలీస్ కమిషనర్ రాకపోవడాన్ని తప్పుబట్టారు. మహారాష్ట్రకు చెందిన తాను సీజేఐ హోదాలో తొలిసారి రాష్ట్ర పర్యటనకు వచ్చినా పట్టించుకోకపోవడం సరైన విధానం కాదని అన్నారు. "నా స్థానంలో ఇంకొకరుంటే రాజ్యాంగంలోని అధికరణం 142ను వినియోగించేవారు" అని సీజేఐ పేర్కొన్నారు. ఈ అధికరణం కింద ఏ వ్యక్తినైనా తమ ముందు హాజరుకమ్మని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇవ్వొచ్చు.

## తైవాన్ కంపెనీతో ప్రీమియర్ ఎనర్జీస్ జేవీ ఏర్పాటు



**సౌర విద్యుత్ ఫలకాలు, సెల్ తయారీలో నిమగ్నమైన ప్రీమియర్ ఎనర్జీస్.. సోలార్ వేఫర్ తయారీ ప్లాంటు ఏర్పాటు కోసం తైవాన్‌కు చెందిన సినో-అమెరికన్ సిలికాన్ ప్రోడక్ట్స్ (ఎస్ఏఎస్)తో కలిసి సంయుక్త సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేయనుంది.**

హైదరాబాద్: సౌర విద్యుత్ ఫలకాలు, సెల్ తయారీలో నిమగ్నమైన ప్రీమియర్ ఎనర్జీస్.. సోలార్ వేఫర్ తయారీ ప్లాంటు ఏర్పాటు కోసం తైవాన్‌కు చెందిన సినోఅమెరికన్ సిలికాన్ ప్రోడక్ట్స్(ఎస్ఏఎస్)తో కలిసి సంయుక్త సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేయనుంది. ప్రపంచంలో మూడో అతిపెద్ద సెమీకండక్టర్ సిలికాన్ వేఫర్ తయారీ సంస్థ గ్లోబల్ వేఫర్స్ కో.లిమిటెడ్‌కు అనుబంధ సంస్థే ఈ ఎస్ఏఎస్. సిలికాన్ వేఫర్ల పరిశోధన, అభివృద్ధి, తయారీలో దీనికి నైపుణ్యం ఉంది. ఈ జేవీ దేశంలో ఏటా 2 గిగావాట్ సామర్థ్యంతో అత్యాధునిక సోలార్ వేఫర్ తయారీ ప్లాంటును ఏర్పాటు చేయనుంది. ఈ సందర్భంగా ప్రీమియర్ ఎనర్జీస్ ఎండీ చిరంజీవ్ సలుజా మాట్లాడుతూ.. తమ తయారీ సామర్థ్యానికి, ఎస్ఏఎస్ అధునాతన సెమీకండక్టర్ వేఫర్ ఉత్పత్తి నైపుణ్యాన్ని జోడించడం ఈ భాగస్వామ్య లక్ష్యమని వివరించారు. భారత్‌లో తయారీ నినాదంలో భాగంగా సౌర విద్యుత్ పరికరాలను స్థానికంగా ఉత్పత్తి చేసేందుకు ఈ జేవీ దోహదం చేస్తుందని తెలిపారు. దేశీయ, విదేశీ మార్కెట్లలో ఉన్న గిరాకీని అందుకునేందుకు ఈ భాగస్వామ్యం తోడ్పడుతుందని గ్లోబల్ వేఫర్స్ ఛైర్‌పర్సన్, సీఈఓ డోరిస్ షూ తెలిపారు.

తెలంగాణలోని మహేశ్వరంలో 1.4 గిగావాట్ సామర్థ్యంతో సోలార్ ఫొటోవోల్టాయిక్ టాప్‌కాన్ మాడ్యూల్ తయారీ ప్లాంటును ప్రారంభించినట్లు ప్రీమియర్ ఎనర్జీస్ అనుబంధ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ తెలిపింది. ముందుగా దీన్ని 1 గిగావాట్ సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, ఇప్పుడు సామర్థ్యాన్ని 1.4 గిగావాట్‌కు విస్తరించింది.

## చైనా కంటే ఎక్కువగా భారత్‌లో చమురు గిరాకీ వృద్ధి




**ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌లోనే చమురు గిరాకీ అత్యంత వేగంగా వృద్ధి చెందవచ్చని ఒపెక్ తన తాజా అంతర్జాతీయ అంచనాల్లో వెల్లడించింది.**

ఒపెక్ అంచనాలు

దిల్లీ: ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌లోనే చమురు గిరాకీ అత్యంత వేగంగా వృద్ధి చెందవచ్చని ఒపెక్ తన తాజా అంతర్జాతీయ అంచనాల్లో వెల్లడించింది. చైనాలో 2025, 2026లో కనిపించే వృద్ధి రేటు కంటే రెట్టింపు గిరాకీ భారత్‌లో కనిపిస్తుందని తెలిపింది. ఆ నివేదికలోని ముఖ్యాంశాలు..భారత చమురు గిరాకీ 2024లోని రోజుకు 5.55 మిలియన్ బ్యారెళ్లతో పోలిస్తే 2025లో 3.39% వృద్ధితో రోజుకు 5.74 మి.బ్యారెళ్లకు చేరొచ్చు. ప్రపంచంలోనే వేగవంతమైన వృద్ధితో పరుగులు తీస్తున్న భారత్ ఇంధన అవసరాలు ఇందుకు దోహదం చేస్తాయి. ఇక 2026లో 4.28% వృద్ధితో రోజుకు 5.99 మిలియన్ బ్యారెళ్ల(బీపీడీ)కు చేరొచ్చు. చైనాలో 2025లో 1.5% మేర, 2026లో 1.25 శాతం మేర మాత్రమే గిరాకీలో వృద్ధి కనిపించొచ్చు. దీంతో పోలిస్తే భారత్‌లో అధికంగా ఉంది.ఇక అమెరికా 2025లో 20.5 మిలియన్ బీపీడీ గిరాకీతో ప్రపంచంలోనే అతిపెద్ద చమురు వినియోగదారుగా కొనసాగనుంది. చైనా 2025లో 16.90 మి.బీపీడీ, 2026లో 17.12 మి.బీపీడీతో రెండో స్థానంలో నిలవనుంది. ఇక భారత్ అతిపెద్ద మూడో వినియోగదారుగా ఉంటుంది. అమెరికాలో 2025, 2026లో 0.09%, 0.6% మేరే ఇంధన గిరాకీలో వృద్ధి కనిపించొచ్చు. మొత్తం మీద వృద్ధిలో మందగమనం కనిపిస్తున్నప్పటికీ.. అంతర్జాతీయ చమురు గిరాకీ 2025, 2026లో 1.3 మిలియన్ బీపీడీ మేర పెరగొచ్చు.

## క్రెడిట్ స్కోరు.. దీంతో చాలా పనుంది..!




**మన జీవితంలో ఏదో ఒక దశలో క్రెడిట్ స్కోరుతో అవసరం పడుతూనే ఉంటుంది. అలాంటి సందర్భాలు ఇప్పుడు చూద్దాం.**

ఆర్థిక వ్యవహారాల గురించి అవగాహన ఉన్న వారికి క్రెడిట్ స్కోరు ప్రాముఖ్యత గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కొంతమంది మాత్రం దీన్ని పెద్దగా పట్టించుకోరు. దీని అవసరం ఏముంటుందిలే అని లైట్ తీసుకుంటూ ఉంటారు. వాస్తవానికి మన జీవితంలో ఏదో దశలో 'క్రెడిట్ స్కోరు' అవసరం ఏర్పడే తీరుతుంది. అప్పుడు నిట్టూర్చే బదులు ఇప్పటి నుంచే మంచి క్రెడిట్ స్కోరు నిర్మించుకోవడంపై దృష్టి సారించడం మేలు. అలాంటి కొన్ని సందర్భాలు ఇప్పుడు చూద్దాం..క్రెడిట్ కార్డు: ఉద్యోగంలో చేరిన తొలినాళ్లలో క్రెడిట్ కార్డుతో పెద్దగా పని ఉండదు. కానీ, రోజులు గడుస్తున్న కొద్దీ, వివాహం అయ్యాక దీని అవసరం ఏర్పడుతుంది. అప్పుడు మీరు దరఖాస్తు చేసినా బ్యాంకులు చూసేది క్రెడిట్ స్కోరునే. ఒకవేళ అప్పటి వరకు మీకు క్రెడిట్ హిస్టరీ లేకపోతే మీరు పనిచేస్తున్న కంపెనీ, వేతనం వంటివి పరిగణనలోకి తీసుకుంటాయి. లేదంటే మీరు చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 75 నుంచి 100 శాతం విలువతో క్రెడిట్ కార్డును జారీ చేస్తాయి. ఆపై మంచి క్రెడిట్ హిస్టరీని నిర్మించడానికి ఈ క్రెడిట్ కార్డును ఉపయోగించొచ్చు. వ్యక్తిగత రుణం: పెద్ద మొత్తంలో సొమ్ము అవసరం అయినప్పుడు చాలా మంది చేసే పని పర్సనల్ లోన్ తీసుకోవడం. అలాంటి సందర్భాల్లోనూ బ్యాంకులు చూసేది క్రెడిట్ స్కోరునే. ఒకవేళ మీకు అసలు రుణ చరిత్ర లేకుంటే లోన్ మంజూరు ఆలస్యం కావొచ్చు. పైగా అధిక వడ్డీ పడుతుంది. ఒకవేళ మీ క్రెడిట్ హిస్టరీ బాగుంటే సులువుగా, తక్కువ వడ్డీకే రుణాలు పొందొచ్చు. మెరుగైన క్రెడిట్ స్కోరు కలిగిన వారికి ప్రీఅప్రూవ్డ్ రుణాలు కూడా జారీ చేస్తాయి. సెకన్లలో ఈ మొత్తాన్ని మీ ఖాతాలో పొందొచ్చు.

హోమ్‌లోన్: మన జీవితంలో తీసుకునే పెద్ద నిర్ణయాల్లో ఒకటి సొంతింటి కొనుగోలు. యుక్త వయసులోనో, నడి వయసులోనో సొంతింటి కల నెరవేర్చుకునేందుకు మనలో చాలామంది ఆరాటపడుతుంటారు. గృహ కొనుగోలుకు పెద్ద మొత్తంలో రుణం పొందాలన్నా క్రెడిట్ స్కోరు చాలా ముఖ్యం. మంచి క్రెడిట్ స్కోరు ఉంటే తక్కువ వడ్డీకి రుణం పొందొచ్చు. దీర్ఘకాలంలో పెద్ద మొత్తంలో ఆదా చేయొచ్చు.కారు: ఈ రోజుల్లో కారు కొనుగోలు కూడా సాధారణంగా మారిపోయింది. ఒకవేళ మీరు పెద్ద మొత్తం వెచ్చించి కారు కొనాలన్నా ఆటో లోన్ అవసరం అవుతుంది. అప్పుడు కూడా క్రెడిట్ స్కోరు ప్రస్తావనకు వస్తుంది.రేపు మీరు పెద్దయ్యాక మీ పిల్లల చదువుల కోసం విద్యా రుణం కోసం దరఖాస్తు చేసినప్పుడు కూడా మీ క్రెడిట్ స్కోరును తనిఖీ చేస్తారు. అంటే జీవితంలో ఏదో ఒక దశలో 'మీ క్రెడిట్ స్కోరు ఎంత?' అన్న ప్రశ్న ఎదురుకాక మానదు. కాబట్టి మన జీవితంలో విస్మరించలేని, విస్మరించకూడని పదం క్రెడిట్ స్కోరు! అందుకే ఇప్పటి నుంచే మంచి క్రెడిట్ స్కోర్‌పై దృష్టి పెట్టండి. మంచి క్రెడిట్ స్కోరు కావాలంటే?

బిల్లులు, ఈఎంఐలు సకాలంలో చెల్లించండి.

క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో 30 శాతం మించకుండా చూసుకోండి.

క్రెడిట్‌కార్డు, పర్సనల్‌లోన్, హోమ్‌లోన్ ఇలా క్రెడిట్ మిక్స్ ఉండేలా చూసుకోండి.

తరచూ రుణాల కోసం దరఖాస్తు చేయొద్దు.

ఎప్పటికప్పుడు క్రెడిట్ స్కోరును తనిఖీ చేసుకుని తప్పులుంటే సరిదిద్దుకోవాలి.

## సైన్యం చేతిలో డ్రోనాయుధాలు!






**భారతదేశ రక్షణ రంగంలో డ్రోన్లు విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాయి. సరిహద్దు నిఘా, యుద్ధ వ్యూహాలు, సరిహద్దులోని బలగాలకు సామగ్రి సరఫరా, ఉగ్రవాదుల గుర్తింపు కార్యకలాపాల్లో సైనిక సామర్థ్యాన్ని డ్రోన్లు గణనీయంగా పెంచుతున్నాయి.**

**భవిష్యత్‌లో డ్రోన్ల ఎగుమతి హబ్‌గా భారత్ వేలల్లో ఉద్యోగాలు**

భారతదేశ రక్షణ రంగంలో డ్రోన్లు విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాయి. సరిహద్దు నిఘా, యుద్ధ వ్యూహాలు, సరిహద్దులోని బలగాలకు సామగ్రి సరఫరా, ఉగ్రవాదుల గుర్తింపు కార్యకలాపాల్లో సైనిక సామర్థ్యాన్ని డ్రోన్లు గణనీయంగా పెంచుతున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), అధునాతన సెన్సార్‌లు, శక్తిమంతమైన కెమేరాలతో కూడిన డ్రోన్లు ఇప్పుడు భారత సైన్యానికి నమ్మకమైన తోడుగా నిలుస్తున్నాయి. ఇటీవలి భారత పాక్ ఉద్రిక్తతల సమయంలో శత్రు దేశంలోని కొన్ని కీలక స్థావరాలను దెబ్బతీయడంలో ఆత్మాహుతి డ్రోన్లు కీలక భూమిక పోషించిన సంగతి చూశాం. గతంతో పోలిస్తే భారత డ్రోన్ పరిశ్రమ గణనీయమైన పురోగతి సాధించింది. ఇది మరింత ముందుకు వెళ్లేందుకు ఆంక్షలు, సాంకేతిక పరిమితులు, సైబర్ సెక్యూరిటీల్లాంటి సవాళ్లు ఉన్నాయి.

స్వదేశీ కంపెనీల హవా..

భారత డ్రోన్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తోంది. స్వదేశీ సాంకేతికతపై దృష్టి సారిస్తూ అనేక సంస్థలు ముందుకు వస్తున్నాయి. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ) మానవ రహిత విమానం రుస్తుం సిరీస్ డ్రోన్‌లను అభివృద్ధి చేస్తోంది. మధ్యస్థ ఎత్తులో ఎక్కువ సమయం ప్రయాణించేలా దీన్ని రూపొందించారు. అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ వంటి ప్రముఖ సంస్థలూ అధునాతన డ్రోన్ల తయారీని చేపడుతున్నాయి. వీటిని సరిహద్దులో నిఘా, యుద్ధం, సామగ్రి చేరవేత తదితరాల కోసం రూపొందిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ఇజ్రాయెల్ సాంకేతికత సహాయంతో బెంగళూరు అంకురం తయారు చేసిన స్కైస్ట్రైకర్ ఆత్మాహుతి డ్రోన్లను సైన్యం వినియోగించింది. హైదరాబాద్‌కు చెందిన మారుత్ డ్రోన్స్‌లాంటివీ సైన్యానికి అవసరమైన సరకులు, ఔషధాల సరఫరాలో కీలకంగా పనిచేశాయి.

సాంకేతిక ఆవిష్కరణలూ ఈ రంగాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. స్వార్మ్ డ్రోన్ సాంకేతికతతో ఒకే సమయంలో అనేక డ్రోన్‌లను సమన్వయం చేసే సామర్థ్యం ఉంటుంది. ఇది రక్షణ వ్యూహాలను మార్చేస్తుంది. హెచ్‌సీఎల్ టెక్‌తో కలిసి ఐఐటీ గువాహటి ఇందుకోసం ఏఐ ఆధారిత అల్గారిథమ్‌లను అభివృద్ధి చేస్తోంది. ఇవి డ్రోన్ల స్వయంప్రతిపత్తిని మెరుగుపరుస్తాయి. అంతేకాకుండా 5జీ కనెక్టివిటీ డ్రోన్లు.. చూస్తున్నదాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయగలవు.

ప్రోత్సాహకాలు ఇలా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రోన్ రంగానికి తగిన ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. 2024లో ప్రవేశపెట్టిన డ్రోన్ శక్తి పథకం రక్షణ డ్రోన్ల అభివృద్ధికి నిధులను కేటాయించింది. అంకురాలకు రాయితీలు, పరిశోధనల కోసం గ్రాంట్లనూ అందిస్తోంది. బెంగళూరు, నోయిడాల్లో ఏర్పాటు చేసిన డ్రోన్ ఇన్నోవేషన్ హబ్‌లు, ఈ రంగంలోని డ్రోన్లకు, పరిశోధన సంస్థలకు సాంకేతిక మద్దతు అందిస్తున్నాయి.

సవాళ్ల సుడిలో..

డ్రోన్ల రంగంలో వృద్ధి కనిపిస్తున్నప్పటికీ పలు సవాళ్లనూ ఎదుర్కొంటోంది.

డ్రోన్ల వినియోగం, పరీక్ష, ఎగుమతులకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వీటి గగన వినియోగంపై విధించిన కఠిన నిబంధనలు. అనుమతుల ప్రక్రియలతో అంకురాలకు ఆర్థిక భారం.అధునాతన డ్రోన్లకు అవసరమైన కీలక విడిభాగాలు, సెన్సార్‌లు, లిథియంఅయాన్ బ్యాటరీలు, సెమీకండక్టర్ చిప్‌ల కోసం చైనా, అమెరికా, ఐరోపాలపై ఆధారపడాల్సి రావడం.

సైబర్ సెక్యూరిటీ ఈ రంగంలో మరో ముఖ్యమైన సమస్య. ఏఐఆధారిత డ్రోన్లు హ్యాక్ చేయడం, రిమోట్ హైజాకింగ్ లేదా సిగ్నల్ జామ్‌లాంటి వాటికి గురయ్యే ప్రమాదం. అవకాశాలెన్నో...

భారత డ్రోన్ మార్కెట్ విలువ 2030 నాటికి 23 బిలియన్ డాలర్ల(సుమారు రూ.2లక్షల కోట్ల)కు చేరుకుంటుందని అంచనా. ఇందులో రక్షణ డ్రోన్లదే అధిక వాటా. వ్యవసాయం, లాజిస్టిక్స్, విపత్తు నిర్వహణ, మౌలిక వసతుల పర్యవేక్షణ విభాగాల్లోనూ డ్రోన్లకు గిరాకీ అధికంగా ఉంటోంది. ఈ గిరాకీని తీర్చేందుకు కేంద్రం డ్రోన్ల తయారీ కోసం ప్రత్యేక పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేయాలని ప్రణాళికలను చేస్తోంది. పలు అంతర్జాతీయ సంస్థలూ ఇక్కడి సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకుంటున్నాయి. ఇవన్నీ భవిష్యత్తులో మన దేశాన్ని డ్రోన్ ఎగుమతి హబ్‌గా మార్చేందుకు దోహదం చేస్తాయని చెప్పొచ్చు. ఈ రంగంలో వేలాది కొత్త ఉద్యోగాలూ వస్తున్నాయి. ముఖ్యంగా ఇంజినీరింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, తయారీ రంగాల్లో నిపుణులకు గిరాకీ అధికంగా ఉంటోంది.

## ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో 33 శాతమే మహిళలు

**భారత ప్రైవేటు రంగంలోని ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో మహిళల ప్రాతినిధ్యం కేవలం 33 శాతంగానే ఉంది. అదే సమయంలో మేనేజర్ స్థాయి ఉద్యోగాల్లో 24 శాతం మందే ఉన్నారు.**

ముంబయి: భారత ప్రైవేటు రంగంలోని ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో మహిళల ప్రాతినిధ్యం కేవలం 33 శాతంగానే ఉంది. అదే సమయంలో మేనేజర్ స్థాయి ఉద్యోగాల్లో 24 శాతం మందే ఉన్నారు. ఉద్యోగ రంగంలో లింగ వివక్షత కారణంగా మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను ఇది స్పష్టం చేస్తోందని ఒక నివేదిక వెల్లడించింది. మెకిన్సే అండ్ కంపెనీ 'వుమెన్ ఇన్ ది వర్క్ ప్లేస్' నివేదిక ప్రకారం.. విశ్వవిద్యాలయాల నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న వారిలో మహిళలు సగం ఉన్నప్పటికీ, ఉద్యోగాల్లో చేరడం, పదోన్నతి తదితర అంశాల్లో అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. భారత్‌తోపాటు, నైజీరియా, కెన్యాలకు చెందిన 324 సంస్థల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా రూపొందించింది. ఇందులో భారత్ నుంచి 77 ప్రైవేటు సంస్థలు (మొత్తం 9 లక్షల మంది ఉద్యోగులు) ఉన్నాయి. ప్రారంభ స్థాయిలో మహిళల సగటు వయసు 39 ఏళ్లు కాగా, పురుషులది 32 ఏళ్లు. ఇది మూడు దేశాల్లో అత్యధిక వయసు తేడా. దీనివల్ల మహిళలు ఆలస్యంగా ఉద్యోగాల్లో చేరుతున్నారు. లేదా చేరినప్పటి స్థాయిలోనే ఎక్కువ కాలం ఉంటున్నారని నివేదిక వెల్లడించింది. మహిళలు పదోన్నతుల్లోనూ వెనకే ఉంటున్నారు. ప్రారంభ స్థాయిలో చేరిన పురుషుడు మేనేజర్ స్థానానికి పదోన్నతి చేరే అవకాశం మహిళలతో పోలిస్తే 2.4 రెట్లు అధికం. అదే సమయంలో మహిళలు ఉద్యోగాల నుంచి వైదొలుగుతున్న రేటు పురుషులతో పోలిస్తే 1.3 రెట్లు ఎక్కువగా ఉంటోంది. 'లింగ సమానత్వం కేవలం నైతిక, సామాజిక అవసరమే కాదు. ఇది వ్యూహాత్మక అవసరం. 2035 నాటికి భారత్ 8 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలంటే శ్రామిక శక్తిలో మహిళల ప్రాధాన్యం పెరగాల్సిందే'నని మెకిన్సే అండ్ కంపెనీ సీనియర్ పార్ట్‌నర్ వివేక్ పండిట్ అన్నారు.







# కింగ్ నాగ్ 'రగడ' మళ్లీ?

మన టాలీవుడ్ సీనియర్ హీరో కింగ్ నాగార్జున ఇప్పుడు పలు సాలిడ్ ప్రాజెక్ట్ లు చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే నాగార్జున సినిమాల్లో మాస్ చిత్రాలకి కొంచెం స్పెసిఫిక్ స్పేస్ ఉంటుంది అని చెప్పవచ్చు. అలా తన నుంచి వచ్చిన కొన్ని పక్కా మాస్ చిత్రాల్లో దర్శకుడు వీరూ పోట్ల తో చేసిన "రగడ" కూడా ఒకటి. అందులో నాగ్ డైలాగ్ డెలివరీ కానీ, కామెడీ సీన్స్ ఇంకా మాస్ మూమెంట్స్ ఫాన్స్ కి ఇప్పటికీ స్పెషల్ గానే ఉంటాయి. మరి ఇలాంటి మాస్ చిత్రం మళ్లీ థియేటర్స్ లో అలరించేందుకు వస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతానికి రీరిలీజ్ సన్నాహాలు జరుగుతున్నాయి అని తెలుస్తోంది. ఇది అయ్యాక డేట్ వస్తుందట. డెఫినెట్ గా ఈ సినిమాకి కూడా మంచి రెస్పాన్స్ వచ్చే ఛాన్స్ ఉంది. ఇక ఈ సినిమాకి థమన్ సంగీతం అందించగా అనుష్క, ప్రియమణి హీరోయిన్స్ గా నటించారు.






### రష్మికను పెళ్లి చేసుకుంటారా?..

# విజయ్ ఆన్సర్ ఇదే..

విజయ్ దేవరకొండరష్మిక మందన్న డేటింగ్ లో ఉన్నారనే వార్త గత కొన్నేళ్లుగా వినబడుతూనే ఉంది. ఎక్కడ చూసినా అంటే లంచ్ డేట్, ఇంకా వెకేషన్స్ అంటూ తిరిగే ఈ జంట పెళ్లి చేసుకుంటారని వారి వారి అభిమానులు అనుకుంటున్నారు. రీసెంట్ గా రష్మిక ఆనంద్ దేవరకొండ మూవీ ఓపెనింగ్ కి రావడం ఈ వార్తలకు బలం చేకూరింది, ఇంకా రష్మిక హైదరాబాద్ వస్తే విజయ్ దేవరకొండ ఇంట్లోనే స్టే చేస్తుంది అంటూ ఉంటారు. తాజాగా విజయ్ దేవరకొండ లేటెస్ట్ చిత్రం కింగ్ డమ్ ప్రమోషన్స్ లో భాగంగా ఫిలిం ఫేర్ మ్యాగజైన్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో విజయ్ దేవరకొండ పెళ్లిపై చేసిన కామెంట్స్ వైరల్ గా మారాయి. నటి రష్మిక ను వివాహం చేసుకుంటారా అని సదరు యాంకర్ ప్రశ్నించగా, రష్మిక తో ఇంకా చాలా సినిమాలు యాక్ట్ చెయ్యాలి, ఆమె ఎంతో మంచి వ్యక్తి, అంతే అందమైన అమ్మాయి. ప్రస్తుతం లైఫ్ పార్ట్ నర్ విషయంలో ఎలాంటి ఆలోచన లేదు, సమయం వచ్చినప్పుడు కచ్చితంగా పెళ్లి చేసుకుంటాను అని చెప్పిన విజయ్ ని మీ లైఫ్ పార్ట్నర్ లో ఉండాల్సిన క్వాలిటీస్ రష్మికలో ఉన్నాయా అంటే విజయ్ మాత్రం మంచి మనసున్న అమ్మాయి ఎవరైనా సరే పెళ్లి చేసుకుంటాను అంటూ ఒంకర టింకరగా సమాధానమిచ్చాడు.



# నయనతారను ఎలా ఒప్పించాడబ్బా?

లేడీ సూపర్ స్టార్ నయనతార ఎంత కమర్షియల్ అనేది అందరికి తెలుసు. తన కోసం కాకుండా ఇతరుల కోసం ఏ చిన్న పని చేసినా అందులో లాభం ఎంతుంటుంది అని చూసుకుంటుంది. సినిమాలకు భారీ పారితోషికాలు డిమాండ్ చేస్తుంది, కానీ ప్రమోషన్స్ కి రాదు, ఏదన్నా అంటే సెంటిమెంట్ అంటూ కవరింగ్. అలాంటి కమర్షియల్ నయనతారను అనిల్ రావిపూడి సినిమా మొదలు కాకముందే పడేసాడు. అనిల్ రావిపూడి మెగా 157 అంటూ మెగాస్టార్ తో సినిమా పూజా కార్యక్రమాలతో మొదలు పెట్టి ఇప్పుడు రెగ్యులర్ షూటింగ్ కి వెళ్లే సందర్భంలో నయనతార ను ప్రాజెక్ట్ లోకి ఆహ్వానిస్తూ చేసిన వీడియో చూసి అందరూ షాకవుతున్నారు. నయనతార లాంటి కమర్షియల్ హీరోయిన్ తో అనిల్ రావిపూడి సినిమా మొదలు పెట్టక ముందే వీడియో చేయించి దానిని వదలడం అందరికి ఆశ్చర్యమే. మేకప్ వేసుకుంటూ, కార్ లో మెగాస్టార్ సాంగ్స్ వింటూ, తెలుగు మట్లాడుతూ, స్క్రిప్ట్ పేపర్స్ చూస్తూ.. అనిల్ రావిపూడితో కలిసి స్టార్ట్ అవుతుంది, సంక్రాంతికి వస్తున్నాం అంటూ అనౌన్స్ చేసిన వీడియో చూసి అనిల్ రావిపూడి సామాన్యుడు కాదు, నయన్ లాంటి హీరోయిన్ ని ప్రీ ప్రమోషన్స్ కి భలేగా వాడేసాడు అంటూ మాట్లాడుకుంటున్నారు.

# ప్రకృతి ఒడిలో మృణాల్ ఠాకూర్

సీతారామం బ్యూటీ మృణాల్ ఠాకూర్ హ్యాట్రిక్ సినిమాల తర్వాత సౌత్ లో సెటిల్ అవుతుంది అనుకుంటే.. అమ్మడుకి టాలీవుడ్ అవకాశాలు మాత్రం ఆచితూచి వస్తున్నాయి. అడవి శేష్ తో డెకాయిట్ లో నటిస్తున్నా మృణాల్ ఠాకూర్ కి ఆ ప్రోజెక్టు షాకివ్వదు కదా అని అందరూ మాట్లాడుకుంటున్నారు, ఎందుకంటే అడివి శేష్ ఆ ప్రాజెక్ట్ ని ఆపేసాడనే టాక్ వినబడుతుంది. ఇక బాలీవుడ్ లో నటిస్తున్న మృణాల్ ఠాకూర్ పేరు ఈ మధ్యన అల్లు అర్జున-అట్లీ ప్రాజెక్ట్ లో బాగా వినబడుతుంది. ఏఏ22లో అల్లు అర్జున్ సరసన వన్ ఆఫ్ ద హీరోయిన్ గా మృణాల్ ఠాకూర్ పేరు పరిశీలనలో ఉంది అన్నారు, అది నిజమా, కాదా అనేది అధికారిక ప్రకటన వస్తే కానీ క్లారిటీ రాదు. సోషల్ మీడియాలో యాక్టీవ్ గా కనిపించే మృణాల్ ఠాకూర్ ఎప్పుడు గ్లామర్ ఫొటోస్ నే వదులుతుంది. రీసెంట్ గా జిమ్ లో చెమటలు చిందిస్తున్న వీడియో షేర్ చేసిన మృణాల్ ఠాకూర్ తాజాగా ప్రకృతి వడిలో సేదతీరుతూ కనిపించింది. బ్లాక్ స్లీవ్ లెస్ గౌన్ లో బ్యాక్ ఓపెన్ తో ప్రకృతి



# రాధిక ఆప్టేకు ప్రయోగాత్మక చిత్రం

కొత్తగా పెళ్లయిన అమ్మాయి చాలా ఊహలు కలల్లో జీవిస్తుంది. భర్తపై చాలా అంచనాలు పెట్టుకుంటుంది. కానీ వాటన్నిటికీ విరుద్ధంగా జీవించాల్సిన పరిస్థితులు తలెత్తుతాయి. పెళ్లయాక ముంబై స్లమ్స్ లో జీవించే ఒక కలలు కనే అమ్మాయి జీవితం ఆ తర్వాత ఎలా టర్న్ అయింది? అనే ఇంట్రెస్టింగ్ కథాంశంతో రూపొందించిన ప్రయోగాత్మక చిత్రం సిస్టర్ మిడ్ నైట్. ఈ చిత్రానికి కరణ్ కంధారి దర్శకత్వం వహించారు. బాఫ్టా, కేన్స్ సహా పలు అంతర్జాతీయ పురస్కారాలకు నామినేట్ అయిన ఈ చిత్రంలో రాధిక ఆప్టే నటనా వైవిధ్యం ఎంతో ఆకట్టుకుంటోంది. ఈ సినిమా ట్రైలర్ ఆద్యంతం .. కొత్తగా పెళ్లయిన యువతి జీవితం, భావోద్వేగాల నేపథ్యంలో ఎంతో రక్తి కట్టిస్తోంది. రాధిక ఆప్టే సహజసిద్ధమైన నటన, వేషధారణ ఆకట్టుకున్నాయి. ప్రతిసారీ ఏదో ఒక ప్రయోగానికి సిద్ధంగా ఉండే రాధిక ఆప్టే మరోసారి ఇలాంటి ప్రయోగాత్మక చిత్రంలో నటించడం ఆసక్తిని కలిగిస్తోంది. ప్రస్తుతం సిస్టర్ మిడ్ నైట్ ట్రైలర్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. డార్క్ కామెడీ నేపథ్యంలోని ఈ చిత్రం మే 23న విడుదలకు సిద్ధమవుతోంది.



# సంయుక్త ఆశలన్నీ ఆ సినిమా మీదే..

విరూపాక్ష తర్వాత సంయుక్తా మీనన్ అలజడే కనిపించలేదు. చెప్పకోవడానికి రెండు సినిమాలు చేసింది గానీ అవి ఎప్పుడు రిలీజ్ అయ్యాయో కూడా తెలియదు. ఫ్లాప్ చిత్రాలు కావడంతో వాటి గురించి ప్రచారంలోకి రాలేదు. అయితే విరూపాక్ష లాంటి 100 కోట్ల వసూళ్ల సినిమా ఉన్నా తదుపరి అవకాశాలు అందుకోవడంలో మాత్రం విఫలమైంది. అందుకు అమ్మడి స్వయంకృపరాధం కూడా కొంత ఉంది. గత ఏడాది లవ్ మీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆ సినిమా గురించి చాలా మందికి తెలియదు. ఈ ఏడాది మాత్రం ఒక్క చిత్రంతోనే అలరించే అవకాశం ఉంది. మిగిలిన చిత్రాలన్నీ వచ్చే ఏడాది మాత్రమే రిలీజ్ అవుతున్నాయి. సినిమాల సంఖ్య మాత్రం ఎక్కువగానే ఉంది. బాలీవుడ్ లో మహారాణీ క్వీన్ ఆఫ్ క్వీన్స్ లో నటిస్తోంది. ఇదే బాలీవుడ్ లో డెబ్యూ చిత్రం. అలాగే నిఖిల్ సరసన పాన్ ఇండియా చిత్రం స్వయంభు`లో నటిస్తోంది. `నారీ నారీ నడుమ మురారీ, హైందవ చిత్రాలతో పాటు మాలీవుడ్ లో రామ్ లో నటిస్తోంది. ఇవన్నీ కూడా వచ్చే ఏడాది రిలీజ్ అవుతున్నాయి. ఈ ఏడాది మాత్రం `అఖండ 2`తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో నటసింహ బాలకృష్ణకు జోడీగా నటిస్తోంది. బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తోన్న సినిమాపై పాన్ ఇండియాలో భారీ అంచనాలున్నాయి.

# ఢిల్లీపై గుజరాత్ సూపర్ విక్టరీ.. ప్లే ఆఫ్స్‌కు మూడు జట్లు



**ఐపీఎల్ 2025లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.**

ఢిల్లీ: ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ జోరు కొనసాగుతోంది. ఢిల్లీని చిత్తు చేసి ప్లేఆఫ్స్‌కు జీటీ దూసుకుపోయింది. ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ ఫలితంతో గుజరాత్ (18 పాయింట్లు)తోపాటు పంజాబ్ కింగ్స్ (17 పాయింట్లు), ఆర్సీబీ (17 పాయింట్లు) ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాయి. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (112*; 65 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఈ లక్ష్యాన్ని గుజరాత్ 19 ఓవర్లలోనే ఒక్క వికెట్టూ కోల్పోకుండా సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్లు సాయి సుదర్శన్ (108*; 61 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) శతక్కొట్టాడు. శుభ్‌మన్ గిల్ (93*; 53 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) చెలరేగాడు.

ఢిల్లీ బ్యాటర్లలో కేఎల్ రాహుల్ సెంచరీ చేయగా.. ట్రిస్టన్ స్టబ్స్ (21*), అభిషేక్ పోరెల్ (30), అక్షర్ పటేల్ (25), డుప్లెసిస్ (5) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో అర్షద్ ఖాన్, సాయి కిశోర్, ప్రసిద్ధ్ కృష్ణ తలో వికెట్ తీశారు. అదేవిధంగా ఈ ఇన్నింగ్స్ ద్వారా కేఎల్ రాహుల్ టీ 20 క్రికెట్‌లో అత్యంత వేగంగా 8,000 పరుగులు పూర్తి చేసిన భారత ఆటగాడిగానూ కేఎల్ రాహుల్ రికార్డు నెలకొల్పాడు. కోహ్లీ 243 ఇన్నింగ్స్‌ల్లో 8 వేల పరుగుల మైలురాయి అందుకోగా.. రాహుల్ 224 ఇన్నింగ్స్‌ల్లోనే సాధించాడు. పంజాబ్ చేతిలో ముంబయి, ఢిల్లీ భవితవ్యం మరోవైపు, ఈ మ్యాచ్‌లో ఓటమితో ఢిల్లీ ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. ప్రస్తుతం ఢిల్లీ 12 మ్యాచ్‌ల్లో 13 పాయింట్లతో ఉంది. చివరి రెండు మ్యాచుల్లోనూ గెలిస్తేనే ఆ జట్టు నాకౌట్‌కు చేరుకొనే ఛాన్స్ ఉంది. నాలుగో స్థానం కోసం ముంబయి ఇండియన్స్ (12 మ్యాచ్‌ల్లో 14 పాయింట్లు), లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (11 మ్యాచ్‌ల్లో 10 పాయింట్లు) కూడా రేసులో ఉన్నాయి. సోమవారం హైదరాబాద్‌తో లఖ్‌నవూ తలపడనుంది. ఇందులో ఓడితే మాత్రం ఇంటిముఖం పట్టినట్టే. ముంబయి ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. మే 21న జరగనున్న మ్యాచ్‌లో ఢిల్లీపై ముంబయి గెలిస్తే ఇతర మ్యాచ్‌ల ఫలితాలతో సంబంధం లేకుండా నేరుగా నాకౌట్‌కు చేరుకుంటుంది. ఒకవేళ ఆ మ్యాచ్‌లో ఢిల్లీ గెలిచినా ముంబయికి అవకాశం ఉంటుంది. ఎందుకంటే అప్పటికి 13 మ్యాచ్‌లు ముగిసేసరికి ఢిల్లీ (15), ముంబయి (14) ఉంటాయి. అప్పుడు ముంబయి, ఢిల్లీ ప్లే ఆఫ్స్ భవితవ్యం పంజాబ్ చేతిలో ఉంటుంది. ఈ రెండు తమ చివరి లీగ్ మ్యాచ్‌లను పంజాబ్‌తోనే ఆడాల్సి ఉంది. మే 24న ఢిల్లీ పంజాబ్ మ్యాచ్, మే 26న పంజాబ్‌ముంబయి మ్యాచ్‌లు జరగనున్నాయి. పంజాబ్ చేతిలో ఢిల్లీ ఓడిపోతే ముంబయికి మరో ఛాన్స్ వచ్చినట్టే. పంజాబ్‌ను ఓడిస్తే ముంబయి ప్లే ఆఫ్స్‌కు చేరుతుంది.

# చరిత్ర సృష్టించిన కేఎల్ రాహుల్.. టీ20ల్లో కోహ్లీ రికార్డు బ్రేక్



**స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ టీ20ల్లో మరో రికార్డు అందుకున్నాడు. ఈ క్రమంలోనే విరాట్ కోహ్లీ పేరిట ఉన్న రికార్డును బ్రేక్ చేశాడు.**

స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ చరిత్ర సృష్టించాడు. టీ20 క్రికెట్‌లో అత్యంత వేగంగా 8,000 పరుగులు పూర్తి చేసుకున్న భారత ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలోనే విరాట్ కోహ్లీ రికార్డును బ్రేక్ చేశాడు. కోహ్లీ 243 ఇన్నింగ్స్‌ల్లో 8 వేల పరుగుల మైలురాయి అందుకోగా.. రాహుల్ 224 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఫీట్ సాధించాడు. ఐపీఎల్ 2025లో భాగంగా గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో రాహుల్ ఈ ఘనత సాధించాడు. రాహుల్ ఢిల్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఓవరాల్‌గా టీ20ల్లో వేగంగా 8 వేల పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో వెస్టిండీస్ క్రికెటర్ క్రిస్ గేల్ (213 ఇన్నింగ్స్‌లు) అగ్రస్థానంలో ఉన్నాడు. పాకిస్థాన్ ఆటగాడు బాబర్ అజామ్ (218) రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. తర్వాతి స్థానాల్లో వరుసగా కేఎల్ రాహుల్, కోహ్లీ, పాక్ బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్ (244) ఉన్నారు.



# మళ్లీ పోరాడి ఓడిన రాజస్థాన్.. ప్లే ఆఫ్స్‌కు చేరువైన పంజాబ్



**ఐపీఎల్ 2025లో కీలక మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 10 పరుగుల తేడాతో గెలుపొందింది.**

జైపూర్: ఐపీఎల్ 2025లో కీలక మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 10 పరుగుల తేడాతో గెలుపొందింది. 12 మ్యాచ్‌ల్లో ఎనిమిదో విజయం అందుకున్న పంజాబ్ (17 పాయింట్లు) ప్లే ఆఫ్స్‌కు అడుగు దూరంలో నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో రాజస్థాన్ 209/7కు పరిమితమైంది. యశస్వి జైస్వాల్ (50; 25 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్), వైభవ్ సూర్యవంశీ (40; 15 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) మరోసారి మెరుపు ఆరంభం ఇచ్చినా రాజస్థాన్‌కు ఓటమి తప్పలేదు. తర్వాత వచ్చిన సంజు శాంసన్ (20; 16 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), రియాన్ పరాగ్ (13; 11 బంతుల్లో 1 సిక్స్) దూకుడుగా ఆడలేకపోయారు. ధ్రువ్ జురెల్ (53; 31 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) పోరాడినా మిగతా బ్యాటర్ల నుంచి సరైన సహకారం అందలేదు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన పంజాబ్ స్పిన్నర్ హర్‌ప్రీత్ బ్రార్ కీలక సమయంలో (3/22) వికెట్లు తీసి రాజస్థాన్‌ను దెబ్బకొట్టాడు. యాన్సెన్, ఒమర్జాయ్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

### జైస్వాల్, సూర్యవంశీ చెలరేగినా

యశస్వి జైస్వాల్, సూర్యవంశీ ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ఫోర్లు, సిక్సర్లతో పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. అర్‌ష్‌దీప్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో జైస్వాల్ వరుసగా నాలుగు ఫోర్లు, ఓ సిక్స్ బాదేసి 22 పరుగులు పిండుకున్నాడు. యాన్సెన్ బౌలింగ్‌లో వైభవ్ రెండు సిక్సర్లు, ఓ సిక్స్ రాబట్టాడు. బార్ట్‌లెట్ బౌలింగ్‌లో జైస్వాల్ మూడు బౌండరీలు బాదడంతో మూడు ఓవర్లకే స్కోరు 50 దాటింది. అర్‌ష్‌దీప్ వేసిన నాలుగో ఓవర్‌లో సూర్యవంశీ ఒక ఫోర్, రెండు సిక్స్‌లు బాదేశాడు. ఈ క్రమంలో వైభవ్ దూకుడుకు హర్‌ప్రీత్ బ్రార్ చెక్ పెట్టాడు. మరోవైపు, జైస్వాల్ దూకుడు కొనసాగించడంతో 8 ఓవర్లకే స్కోరు 100 దాటింది. 24 బంతుల్లో హాఫ్ సెంచరీ అందుకున్న యశస్వి.. హర్‌ప్రీత్ బౌలింగ్‌లోనే వెనుదిరిగాడు. శాంసన్ కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. ఈ క్రమంలో జురెల్, పరాగ్ నిలకడగా ఆడటంతో 13 ఓవర్లకు రాజస్థాన్ 143/3 పటిష్ఠస్థితిలో నిలిచింది. కానీ, తర్వాతి ఓవర్‌లోనే పరాగ్‌ను హర్‌ప్రీత్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. హెట్‌మయర్ (11; 12 బంతుల్లో) నెమ్మదిగా ఆడినా జురెల్ దూకుడు కొనసాగించడంతో రాజస్థాన్ విజయం దిశగా సాగింది. చివరి రెండు ఓవర్లలో విజయ సమీకరణం 30 పరుగులు కాగా.. 19వ ఓవర్‌లో అర్‌ష్‌దీప్ 8 పరుగులు మాత్రమే ఇచ్చాడు. చివరి ఓవర్‌లో యాన్సెన్ 11 పరుగులే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టడంతో పంజాబ్ గెలిచింది.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ కింగ్స్.. నేహల్ వధేరా (70; 37 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), శశాంక్ సింగ్ (59*; 30 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ శతకాలు బాదడంతో భారీ స్కోరు చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (21; 10 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయస్ అయ్యర్ (30; 25 బంతుల్లో 5 ఫోర్లు), అజ్మతుల్లా ఒమర్జాయ్ (21*; 9 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ప్రియాంశ్ ఆర్య (9), మిచెల్ ఓవెన్ (0) నిరాశపర్చారు. రాజస్థాన్ బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే 2, క్వెనా మఫాక, రియాన్ పరాగ్, ఆకాశ్ మధ్వాల్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# ఫైనల్‌ను తరలించడం అంత తేలిక కాదు

**ఐపీఎల్ ఫైనల్ ఈడెన్ గార్డెన్స్‌లోనే జరుగుతుందన్న ఆశాభావాన్ని బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ వ్యక్తం చేశాడు. బీసీసీఐతో బెంగాల్ క్రికెట్ సంఘానికి మంచి సంబంధాలు ఉన్నాయని అన్నాడు.**



కోల్‌కతా: ఐపీఎల్ ఫైనల్ ఈడెన్ గార్డెన్స్‌లోనే జరుగుతుందన్న ఆశాభావాన్ని బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ వ్యక్తం చేశాడు. బీసీసీఐతో బెంగాల్ క్రికెట్ సంఘానికి మంచి సంబంధాలు ఉన్నాయని అన్నాడు. టోర్నీ సస్పెన్షన్ అనంతరం ఐపీఎల్ లీగ్ దశ మ్యాచ్‌లను రీషెడ్యూలు చేసిన బీసీసీఐ.. ప్లేఆఫ్స్ వేదికలను ఇంకా అధికారికంగా ఖరారు చేయని సంగతి తెలిసిందే. వాస్తవ షెడ్యూలు ప్రకారం ఐపీఎల్ ఫైనల్ మే 25న కోల్‌కతాలోనే జరగాల్సివుంది. "బీసీసీఐతో మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నాం. ఫైనల్‌ను తరలించడం అంత తేలిక కాదు. అది ఈడెన్‌లో జరగాల్సిన మ్యాచ్. అక్కడే జరుతుందని ఆశిస్తున్నా" అని గంగూలీ అన్నాడు. ఐపీఎల్ ఫైనల్‌ను కోల్‌కతాలోనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కొంతమంది శుక్రవారం.. ఈడెన్ గేటు బయట నిరసన చేశారు. "నిరసనతో పెద్దగా ఉపయోగపడడం ఉండదు. బెంగాల్ క్రికెట్ సంఘంతో బీసీసీఐకి మంచి సంబంధాలు ఉన్నాయి" అని గంగూలీ చెప్పాడు. కోల్‌కతాలో వర్షం పడే అవకాశం ఉండడంతో బీసీసీఐ.. ఫైనల్‌ను తరలించడం గురించి ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

# బుమ్రాపై భారం వద్దు.. టెస్టు కెప్టెన్సీపై రవిశాస్త్రి

**భారత టెస్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఈ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో అతడి స్థానాన్ని భర్తీ చేసేదెవరన్న దానిపై అమితాసక్తి నెలకొంది.**

దుబాయ్: భారత టెస్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఈ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో అతడి స్థానాన్ని భర్తీ చేసేదెవరన్న దానిపై అమితాసక్తి నెలకొంది. ఆస్ట్రేలియాతో సిరీస్‌కు వైస్ కెప్టెన్‌గా ఉండి, రెండు మ్యాచ్‌ల్లో జట్టును నడిపించిన బుమ్రాకే పగ్గాలు ఇవ్వాలని కొందరు డిమాండ్ చేస్తుంటే.. భవిష్యత్ దిశగా యువ సారథి అవసరమన్న ఉద్దేశంతో శుభ్‌మన్ గిల్‌కు బాధ్యతలు అప్పగించాలనే వాదన మరోవైపు వినిపిస్తోంది. టీమ్ఇండియా మాజీ కోచ్, వ్యాఖ్యాత రవిశాస్త్రి సైతం బుమ్రాకు కెప్టెన్సీ ఇవ్వకపోతేనే మంచిదని అంటున్నాడు. శుభ్‌మన్‌తో పాటు పంత్ నాయకత్వ బాధ్యతలకు సిద్ధంగా ఉన్నారని అతను అభిప్రాయపడ్డాడు. "ఆస్ట్రేలియా సిరీస్ చూశాక బుమ్రానే కెప్టెన్సీకి సరైన వాడని నాకూ అనిపించింది. కానీ బుమ్రాను సారథిగా చేస్తే బౌలర్‌గా అతణ్ని కోల్పోతాం. ఒక్కో మ్యాచ్ చూసుకుని ఆడాల్సిన స్థితిలో అతనున్నాడు. తీవ్ర గాయం తర్వాత కోలుకుని ఇప్పుడే అందుబాటులోకి వచ్చాడు. ఐపీఎల్ ఆడుతున్నాడు. అందులో వేసేది నాలుగు ఓవర్లే. తర్వాత టెస్టుల్లో 1015 ఓవర్లు బౌలింగ్ చేయడం మొదలుపెడతాడు. కానీ కెప్టెన్సీ తాలూకు ఒత్తిడి అతడి బుర్రపై పడడం మంచిది కాదు. కెప్టెన్‌గా తీర్చిదిద్దడానికి శుభ్‌మన్ మంచి ఎంపికే. అతడికో అవకాశం ఇవ్వండి. తనకిప్పుడు 25 ఏళ్లే కాబట్టి ఎదగడానికి అవకాశముంటుంది. పంత్ రూపంలో మరో ప్రత్యామ్నాయం కూడా ఉంది. వయసు రీత్యా వీళ్లిద్దరూ ఇంకో దశాబ్దం పాటు ఆడే అవకాశముంది. ఐపీఎల్‌లో కెప్టెన్లుగా అనుభవం కూడా సంపాదించారు" అని రవిశాస్త్రి అన్నాడు.

